# తొలి నిర్ణయం

- దూరి వెంకటరావు

''బతికినన్నాళ్ళూ మారాజులా బతికాడు. కాలం తీరిపోయింది వెళ్ళిపోయాడు.. ప్చ్... సహాయపడటమే తప్ప ఏనాడు ఎవర్నీ అర్థించి ఎరుగడు. చేసుకున్న పుణ్యం ఉత్తినే పోతుందా? అది నీకు నీ పిల్లలకు శ్రీరామరక్ష'' ఓదార్పుగా అన్నది అలివేణి.

''పోయినవాళ్ళతో మనమూ పోలేం. వాళ్ళ తీపిగుర్తుల్ని మననం చేసుకోవడం మినహా మనకు మరో గత్యంతరంలేదు. గుండె దిటవు చేసుకోండి'' ఊరడించింది ఉమాదేవి.''

''చెట్టంత బిడ్డ అండగా ఉండగా చింతపడటం దండగ. కొడుకు చెంతన శేష జీవితం గడిపేయండి'' ధైర్యం నూరిపోసింది అపర్ణ.

ఎవరెన్ని విధాల సముదాయిస్తున్నా సీతామహలక్ష్మమ్మ గుండెమాత్రం స్థిమితపడటంలేదు. భర్త స్మృతులే అనుక్షణం గుర్తుకొస్తున్నాయి.

చీకటిపడింది.

పరామర్శకొచ్చిన వాళ్ళొక్కొకళ్ళూ మెలమెల్లగా జారుకుంటున్నారు.

ఒంటరిగా మిగిలింది సీతామహలక్ష్మి.

''నువ్వొక్కర్తివి ఇక్కడ ఏం ఉంటావమ్మా. లేచి పెట్టిసర్దుకో'' అన్నాడు మహేశ్ తల్లివద్దకొచ్చి.

మాట్లాడలేదు మహలక్ష్మి.

మళ్ళీ మహేశే అన్నాడు, ''కొంప వుందికదా అని దాని చూరు పట్టుకుని వ్రేలాడనక్కర్లేదు. ఏదో రేటుకి అమ్మేస్తే సరిపోతుంది.

''ఔనత్తయ్యా. కన్నకొడుకు ఉండగా మీరొక్కరూ ఇక్కడుండటం బాగోదు. మీమాట అటుంచి లోకం మమ్మల్ని ఆడిపోసుకుంటుంది. మామాట విని బట్టలు సర్దుకోండి'' పెనిమిటి మాటలకు వత్తాసు పలికింది కోడలపిల్ల.

కొడుకు కోడలే కాదు. గత పన్నెండు రోజులైఅంతా అదేమాట అంటున్నారు.

అయితే మహలక్ష్మమ్మ నోట్లోంచి ఏమాట ఊడి బయటపడటంలేదు. తల్లినిక ఒత్తిడి చేయడమిష్టంలేక నిర్ణయాన్ని ఆమెకే విడిచిపెట్టేసాడు మహేశ్.

కథలు చెబుతూ పిల్లల్ని నిద్రపుస్తోంది కోడలు.

సీతామహలక్ష్మమ్మ మెలమెల్లగా గతంలోకి వెళ్ళింది.

• • •

పదోఏడు వచ్చేదాక ఇంటివద్దే చదూకుంది సీతామహలక్ష్మి తర్వాత ఆమెను స్కూల్లో వేయాలనుకున్నాడు మాధవరావు.

తోటిపిల్లల పేర్లతో పోల్చి చూసుకుంటే తనపేరు తనకే ఎంతో ఎబ్బెట్టుగా తోచింది సీతామహలక్ష్మికి.

''బడిలో పేరు వేయించేటప్పుడు గీతా అనిగాని సునీత అనిగాని వేయించమని నాన్నగారికి

అమ్మ అదిలింపుతో ఆదిలోనే పేరు విషయంలో కన్నవాళ్ళతో రాజీ పడక తప్పలేదు సీతామహాలక్ష్మికి. అప్పటికే కాలంలో ఎన్నో మార్పులొచ్చేస్తున్నాయి. అబ్బాయిలతో సమానంగా అమ్మాయిలు కూడ సైకిళ్ళు తొక్కుతున్నారు. మోటారు వాహనాలు నడుపుతున్నారు. క్లాసులో కొందరాడపిల్లలు డ్రస్సులు వేసుకోవడం చూసి తనకు ఒక డ్రస్సు కుట్టించమంది.

చెప్పమ్మా'' అంటూ తల్లిని బ్రతిమలాడింది.

''నిక్షేపంలాంటి లక్ష్మీదేవి పేరు మానేసి గీతా రాతా ఏవిటే? ఈముక్క నాదగ్గరంటే అన్నావుగాని నాన్నగారితో అనబోకు చీరేయగలరు.''

అమ్మ అదిలింపుతో ఆదిలోనే పేరు విషయంలో కన్నవాళ్ళతో రాజీ పడక తప్పలేదు సీతామహాలక్ష్మికి.

అప్పటికే కాలంలో ఎన్నో మార్పులొచ్చేస్తున్నాయి. అబ్బాయిలతో సమానంగా అమ్మాయిలు కూడ సైకిళ్ళు తొక్కుతున్నారు. మోటారు వాహనాలు నడుపుతున్నారు.

క్లాసులో కొందరాడపిల్లలు డ్రస్సులు వేసుకోవడం చూసి తనకు ఒక డ్రస్సు కుట్టించమంది.

''నీకేమైనా మతిపోయిందా? మగరాయళ్ళలా ఆ డ్రస్సులు ఏం బావున్నాయని?.. పరికిణి వోణీలోవున్న అందం ఆ డ్రస్సుల్లో ఎక్కడుంది? పోను పోను నీ బుద్ధి పెడదారిపడుతోంది.''

తల్లి పెట్టిన చీవాట్లతో చిరువయసులోనే ఆ చిన్నారి కోరికకు తెరపడిపోయింది.

ఫస్టు మార్కులకోసం పట్టుదలగా చదివింది.

యస్.యస్.సి. ఫస్టుక్లాసులో పాసైంది.

అత్తెసరు మార్కులతో పరీక్ష అయిందనిపించిన వాళ్ళంతా కాలేజీలకు ఎగబడుతున్నారు. అటువంటప్పుడు తను చేతులు ముడుచుకుని కూర్చోడంలో అర్థం లేదనిపించింది. అందుకే తండ్రితో ఇంటర్‌మీడియట్ చదువుతానంది.

''చదివిన చదువు చాల్లెండి. అది ఆడమన్నట్లు ఆడుతూపోతే రేపు బియ్యే కూడ చదువుతానంటుంది. అప్పుడు దానికి మనం ఎమ్మే మొగుడ్ని ఎక్కడనుండి తెస్తాం? నామాట విని ఇకనుండైనా సంబంధాలు చూడండి. రెండోది అప్పుడే పయిట వేసుక్కూర్చుంది. పెద్దపిల్ల నెత్తిమీదైనా రెండక్షింతలు పడకపోతే లోకం దుమ్మెత్తి పోస్తుంది.''

అమ్మమాటకు అరికాలు మంట తలకెక్కింది సీతామహలక్ష్మికి. ఎలాగైనాసరే అమ్మని నాన్నని తన దారికి తెచ్చుకోవాలనుకుంది. అనుకోవడమే తడు ఆదిసగా ప్రయత్నాలు ప్రారంభించింది.

చదువుకుంటానంటూ పేచి పెట్టింది. సత్యాగ్రహం చేసింది. సహాయ నిరాకరణ చేపట్టింది.

అయినా వాళ్ళు ఎంతకు దిగిరాకపోవడంతో చదువు విషయంలో కూడ రాజీపడక తప్పలేదు.

పెళ్లిచూపులు మొదలయ్యాయి.

చదువు బాగా తక్కువని కొన్నిసంబంధాలు, ఉద్యోగం చేయడంలేదన్న మిషతో మరికొన్ని వచ్చినట్లే వచ్చి తప్పిపోయాయి.

ఎంత కట్నం పోసైనా ఆఏడు కూతురు పెళ్లి జరిపించేయాలనుకున్నాడు మాధవరావు. అయితే ఏదీ కుదరడంలేదు.

కట్నాలు ఇచ్చేవాళ్ళు ఉన్నంతకాలం ఈ వ్యవస్థలో పుచ్చుకునేవాళ్ళు ఉంటూనే ఉంటారు. దానికి ఫుల్‌స్టాపు ఇచ్చేవాళ్ళు పెట్టాలి తప్ప పుచ్చుకునే వాళ్ళు కాదు. ఆ డబ్బు అలా పెళ్లికోసం కాకుండా చదువుకి వెచ్చిస్తే ఎంత బావుండేది? అనిపించింది

సీతామహాలక్ష్మికి.

తన ఆశయం మెడిసన్ చదవడం. డాక్టరై పేరు ప్రఖ్యాతులు గడించడం. అయితే అందుకు భిన్నంగా ఒక ప్రయివేటు హాస్పటల్లో కంపౌండరుగా పనిచేసే వ్యక్తిని పెళ్లి చేసుకోవలసి వస్తుందని ఏనాడు అనుకోలేదు.

''మేం ఇంతకన్నా మంచి సంబంధం తేలే''మంటూ మెడవంచి తాళి కట్టించారు.

ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రంగావున్నా అపురూపంగా చూసుకుంటున్న భర్త దొరికినందుకు ఆ జీవితంతోనే రాజీపడిపోయింది.

ఏడాది తిరక్కుండానే పండంటి బిడ్డకు జన్మనిచ్చింది.

తనకు డాక్టరు అయే యోగం ఎలానూలేదు. కొడుకునైనా బాగా చదివించి డాక్టర్ని చేయాలనుకుంది. వాడు యం.బి.బి.యస్. పాసైతే తనే డాక్టరైనంతగా సంబరపడిపోవాలనుకుంది. ప్చ్... ఆ కోర్కైనా నెరవేరుతేనా?... 'అంతపెద్ద చదువు మనమేం చెప్పించగలం' అంటూ భర్త నుండి ప్రతిఘటన ఎదురైంది.

డిగ్రీ పూర్తి అవడంతోనే మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పోస్టింగు వస్తే హైదరాబాదు వెళ్ళిపోయాడు మహేశ్.

అందం, చదువు, హోదా అన్నీవున్న బిడ్డకు చక్కని జోడీ కోసం వేట ప్రారంభించింది సీతామహాలక్ష్మి.

ఇలావుండగా తనో అమ్మాయిని ప్రేమించానని అనివార్య పరిస్థితులలో మాట మాత్రమైనా చెప్పకుండా పెళ్లి చేసుకోవలసి వచ్చిందంటూ మహేశ్ నుండి ఉత్తరం వచ్చింది.

ఆ వార్తకు హతాసురాలైంది సీతామహాలక్ష్మి.

''అబ్బాయి తనకిష్టమైన అమ్మాయిని చేసుకున్నాడు. అయిందేదో అయిపోయింది. ఇప్పుడు మనం కోపతాపాలకుపోయి వాళ్ళను దూరం చేసుకునే బదులు పెద్దవాళ్ళగా వాళ్ళని ఆశీర్వదించడం ఉత్తమం'' అంటూ హితవు చెప్పాడు భర్త.

కొడుకుదగ్గర కొంతకాలం గడుపుదామని హైదరాబాదువెళ్ళి వాళ్ళ మధ్య ఇమడలేక తిరిగొచ్చారు మాధవరావు దంపతులు.

వాళ్ళకు బిడ్డమీద పెంచుకున్న భ్రమలన్నీ తొలగిపోయాయి.



• • •

ఇంటి ముందునుంచి బ్యాండు మేళాలతో పెళ్లి ఊరేగింపు వెళ్ళడంతో గతంలోంచి బయటపడింది సీతామహాలక్ష్మి. ఇంతవరకు జీవితంలో ప్రతి విషయంలోను రాజీపడుతూనే వచ్చింది. నిజానికి తన బ్రతుకే రాజీ బ్రతుకైపోయింది.

కొడుకువద్దకు భర్తతో వెళ్ళినప్పుడే ఆశించిన గౌరవం దక్కలేదు. ఇప్పుడు లోకంతో రాజీపడి తనకు తాను బిడ్డదగ్గరకెళితే ఇంకెన్ని అవమానాల్ని మోయవలసి వస్తుందో?.. వద్దు.. కష్టమో నష్టమో తన గూట్లో పడుంటేనే ఠవంత మనశ్శాంతి. ఇక ఎవరు ఎంత వత్తిడి చేసినా ఈ సందర్భంగా రాజీ పడకూడదన్న నిర్ణయానికొచ్చేసింది. జీవితంలో తనకు తానుగా తీసుకున్న తొలి నిర్ణయమది–

''నేను మీ నాన్నగారి జ్ఞాపకాలతో ఈ వూళ్ళో ఈ ఇంట్లోనే వుంటాను...'' అని కొడుక్కి ఖచ్చితంగా చెప్పింది.

★